ఇంటింటా సర్వే సందడి

సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమయింది. తొలుత మూడు రోజుల పాటు వారికి కేటాయించిన ఇళ్లకు స్టిక్కర్లు వేసిన ఎన్యుమరేటర్లు.. శనివారం పూర్తి స్థాయిలో సమాచార సేకరణకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రశ్నావళికి కుటుంబాల నుంచి సమాధానం కోరగా.. ఆస్తులు, అప్పులు తదితర వాటి వివరాలు చెప్పేందుకు ప్రజలు నిరాకరిస్తున్నట్లు సమాచారం. పర్యవేక్షణలో ఉన్న అధికారులు సైతం సర్దిచెప్పినప్పటికీ.. ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది.

ఆస్తుల వివరాలు ఇచ్చేందుకు వెనుకాడుతున్న ప్రజలు!

- ఆధార్ కార్డులు చూపేందుకు విముఖత
- సర్వే అంశం వివరించినా ససేమిరా
- పర్యవేక్షించిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు
- తొలిరోజు మందకొడిగా సాగిన కులగణన


ఇబ్రహీంపట్నం: కులగణనను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ప్రారంభమైంది. స్టిక్కర్ల ప్రక్రియ అనంతరం .. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం ఇచ్చిన ప్రశ్నావళితో కుటుంబ యాజమానుల నుంచి సమాచారం సేకరించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 8 వేల ఇళ్లను గుర్తించారు. ప్రతి బ్లాక్‌లో 150 నివాసాలు ఉండేలా 102 ఈబీలను ఏర్పాటు చేశారు. 77 మంది ఎన్యుమరేటర్ల (16 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులు, మిగతా ఎస్‌హెచ్‌జీ)లతో కులగణన కొనసాగగా.. మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ తదితర అధికారులు ప్రక్రియను పరిశీలించారు. ఏమైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. మొత్తంగా పుర పరిధిలో 217 కుటుంబాల వివరాలను సేకరించారు. ఇదిలా ఉండగా.. ఒక్కో ఫారం పూర్తి చేయడానికి అరగంట సమయం పడుతుందని ఎన్యుమరేటర్ సంధ్యారాణి పేర్కొన్నారు. అడిగిన ధ్రువపత్రాలను ఇంటి యాజమానులు వెంటనే ఇవ్వకపోవడంతో కొంత జాప్యం జరిగిందని, ఆధార్ అందుబాటులో లేకపోవడంతో నంబర్ లేకుండా పేర్లు నమోదు చేసుకున్నామని వెల్లడించారు. రెండుమూడు రోజుల పాటు సర్వే మందకొడిగా సాగినా.. తర్వాత ఊపందుకుంటుందని అధికారులు పేర్కొన్నారు.


కడ్తాల్: రేఖ్యతండాలో వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్, పరిశీలిస్తున్న అధికారులు


యాచారం: చింతపట్లలో సర్వేను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శ్రీలత, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

20 లోగా పూర్తి చేయాలి

తలకొండపల్లి: ఇంటింటి కుటుంబ సర్వేను సూచించిన గడువు లోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీకాంత్, ఎంఈఓ చాంప్లా నాయక్‌లు ఎన్యుమరేటర్లకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో 14,395 ఇళ్లను గుర్తించామని, సర్వేకు 107 మంది ఎన్యుమరేటర్లను నియమించామని వెల్లడించారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 కుటుంబ సర్వే ఫామ్స్‌ను అందజేశామని, ప్రతి రోజు 15 ఫామ్స్‌ను పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫామ్స్‌లో ఇచ్చిన ప్రకారం 56 ప్రశ్నలు, 19 అనుబంధ ప్రశ్నలకు తప్పనిసరిగా కుటుంబ యజమాని నుంచి సమాచారం తీసుకుని, కులం, ఆదాయం, రాజకీయ తదితర వివరాలతో కూడిన 75 కాలాలను పూరించి, సర్వేను ఈ నెల 20వ తేదీ లోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైంది. మండల పరిధిలోని 111 బ్లాక్‌లకు 88 మంది ఎన్యుమరేటర్లు వారికి కేటాయించిన గ్రామాల్లో సమగ్ర సమాచార సేకరణ చేపట్టగా.. 9 మంది అధికారులు తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీఓ సుజాత, వివిధ శాఖలకు చెందిన ఏఈలు పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు ఎన్యుమరేటర్లకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అధికారులకు సహకరించాలని ప్రజలకు సూచించారు.

కులగణన అన్నారు.. ఇన్ని ప్రశ్నలు ఎందుకు?

యాచారం: కులగణన అని, ఇన్ని ప్రశ్నలు ఎందుకు అడుగుతున్నారు?. ఈ సర్వేతో ప్రజలకు ఏం న్యాయం జరుగుతుందని పలువురు ఎన్యుమరేట్లను ప్రశ్నించారు. మండల పరిధి గ్రామాల్లో తొలిరోజు సర్వేను తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి శ్రీలత పరిశీలించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో కుల సర్వే చేపట్టి, బీసీల రిజర్వేషన్లు పెంచుతామని పేర్కొన్న ప్రభుత్వం.. ఇప్పుడు ఇన్ని ప్రశ్నలు ఎందుకు అడుగుతుందని ప్రజలు ప్రశ్నించగా.. ఈ సర్వేతో అందరికీ న్యాయం జరుగుతుందని, రిజర్వేషన్లు కల్పించే అవకాశం ఉందని ఎన్యుమరేటర్లు నచ్చజెపుతూ.. సమాచారం సేకరిస్తున్నారు.

ఆస్తుల ప్రశ్నకు నో ఆన్సర్


సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు

తలకొండపల్లి: కులగణన నేపథ్యంలో ఎన్యుమరేటర్లు వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్తున్నారు. ఫాంలో సూచించిన 56 ప్రశ్నలు, 19 అనుబంధ ప్రశ్నలకు సంబంధించిన సమాచారాన్ని కుటుంబ సభ్యుల నుంచి రాబట్టేందుకు యత్నిస్తున్నారు. అయితే.. కొన్ని ప్రశ్నలకు సమధానం చెప్పేందుకు ప్రజలు ఇష్టపడటం లేదు. ముఖ్యంగా ఆస్తులు, అప్పులకు సంబంధించిన అంశాలను వివరించేందుకు నిరాకరిస్తున్నట్లు సమాచారం. తొలి రోజున 75 ప్రశ్నలకు సమాధానం తెలుసుకునేందుకు సుమారు 40 నిమిషాల నుంచి గంట సమయం పట్టిందని, ఈ లెక్కన రోజుకు కనీసం 10 నుంచి 12 ఫామ్స్ పూర్తి చేయవచ్చునని ఎన్యుమరేటర్లు పేర్కొంటున్నారు.

ఒక్కో ఇంటి వద్ద అరగంట

ఆమనగల్లు: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ఒక్కో ఇంటి వద్ద అరగంటకు పైగా సమయం తీసుకుంటుందని ఎన్యుమరేటర్లు తెలిపారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాలో సర్వే ప్రక్రియను 'సాక్షి' పరిశీలించగా.. కుటుంబీకుల నుంచి వివరాలు తెలుసుకునేందుకు సమయం ఎక్కువ పడుతున్నట్లు తెలిసింది. వారి వద్ద ఆధారాలు సరిగా లేక.. సరైన సమాచారం లభించడం లేదు. కొందరు రైతులు తమకు రైతుబంధు రావడం లేదని, ఇళ్లలేదని ప్రభుత్వం ఇళ్లు ఇస్తుందా అని ఎన్యుమరేటర్లను ప్రశ్నించడం గమనార్హం.


వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్ సంతోషిణి

రేషన్, ఆరోగ్య శ్రీ కార్డులు పోవు

మాడ్గుల: విద్య, ఉపాధి, సామాజిక, రాజకీయ ఆర్థిక ప్రణాళికల కోసం ప్రభుత్వం సమగ్ర సర్వే ప్రారంభించిందని మండల ప్రత్యేక అధికారి నర్సిరెడ్డి తెలిపారు. మండల పరిధి కోల్కుపల్లిలో సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. కులగణనతో రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు పోతాయనే ప్రచారం అవాస్తవం అని, సర్వేలో అధికారులు ఎవరి నుంచి ఎలాంటి పత్రాలు తీసుకోరని స్పష్టంచేశారు. అపోహలు వీడి.. ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మావతి, ఎంఈఓ సర్దార్ నాయక్, ఉపాధ్యాయులు, కార్యదర్శులు పాల్గొన్నారు.


మాడ్గుల: సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

క్లుప్తంగా

ఘనంగా గోవిందరాజ స్వామి కల్యాణం


పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

తలకొండపల్లి: శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజు స్వామి వారి కల్యాణం శనివారం కన్నుల పండువగా జరిగింది. మండల పరిధి వెల్జాల్‌లో అయ్యప్ప రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎంపీపీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌యాదవ్ హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనను సన్మానించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసమూర్తి, రవి, నరేందర్ గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

ఏడీఏ సుధారాణి


కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ తదితరులు

కందుకూరు: సరైన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి ప్రయోజనం పొందాలని మహేశ్వరం ఏడీఏ సుధారాణి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. వడ్ల తేమ శాతం, నాణ్యత తదితర విషయాలను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు సన్నవడ్లు క్వింటాల్‌కు రూ.500 బోనస్ లభించాలంటే తేమ శాతం 17లోపు ఉండేట్లు చూసుకోవాలన్నారు. ముందుగా రైతులు ధాన్యం శాంపిల్‌ను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి, తేమ శాతంతో పాటు నాణ్యత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీంతో ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉంటుందన్నారు. ఏఈఓలు రాజు,రాఘవేంద్రాచారి, సీఈఓ యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


బాలాపూర్ బీఎల్‌ఓ బూతులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

బడంగ్‌పేట్: బాలాపూర్, సరూర్‌నగర్ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం మొదలైన దృష్ట్యా ఆర్డీఓ పోలింగ్ బూతులను పరిశీలించారు. బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని, అర్హులందరూ కొత్తగా ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకోవడానికి ఈ నెల 28న చివరి తేదీ అని తెలిపారు. ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు.

బాలికలు క్రీడారంగంలో రాణించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలత


పోటీలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, నిర్వాహకులు

తుక్కుగూడ: బాలికలు చదువుతో పాటు తమకు ఆసక్తి ఉన్న క్రీడారంగంలో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ 68వ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ తమ ప్రతిభ కనబరించి, ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కౌన్సిలర్ ఆర్.రాజు, భావన, నిర్వాహకులు, పాఠశాల సిబ్బంది, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌పై ఫ్లెక్సీలు కడితే చర్యలు

ఆమనగల్లు: జాతీయ రహదారి డివైడర్‌పై ఫ్లెక్సీలు కడితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. పట్టణంలోని హైదరాబాద్-శ్రీశైలం నేషనల్ హైవేపై ఉన్న డివైడర్‌పై రాజకీయ నాయకులు, వ్యాపార సంస్థలు ఫ్లెక్సీలు కడుతున్నారని, దీని వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు ఫ్లెక్సీలు కట్టరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి

ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్ డాక్టర్ శ్రీరాములు

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలని ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరాములు అధ్యాపకులకు సూచించారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి చింతపల్లిగూడ ఎంఆర్‌ఎం పీజీ కళాశాలలో 2022-24 బ్యాచ్ ఎంబీఏ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పట్టాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని, అధ్యాపకులు బోధించిన విషయాలను నేర్చుకొని జీవితంలో స్థిరపడాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులకు పేరుప్రఖ్యాతులు తేవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఎం కళాశాల చైర్మన్ ఎండీ హబీబుద్దీన్, ఎంబీఏ ప్రిన్స్‌పాల్ డాక్టర్ సునిత, ఫార్మసీ ప్రిన్స్‌పాల్ డాక్టర్ శ్యామ్, డైరెక్టర్ ఎండీ ఆసిఫ్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్తు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధి పిగ్లీపూర్ అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ చీఫ్ సివిల్ ఇంజనీర్ డాక్టర్ ఎస్.నాగభూషణరావు మాట్లాడుతూ.. విద్యతోనే భవిష్యత్ అని, ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతారని పేర్కొన్నారు. కృషి పట్టుదలతో విద్యనభ్యసిస్తూ లక్ష్యసాధన దిశగా విద్యార్థులు చదువుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవి కృష్ణమూర్తి మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదవాలని, ఆధునిక నైపుణ్యతతో ముందుకుసాగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌అండ్‌ఎస్ హెచ్‌ఓడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటు ప్రతిపౌరుడి హక్కు


ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన తహసీల్దార్


ఆమనగల్లు: బీఎల్‌ఓతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనునాయక్

- అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోండి
- కడ్తాల్ తహసీల్దార్ ముంతాజ్, ఆమనగల్లు, తుర్కయంజాల్ ఆర్డీఓలు


తుర్కయంజాల్: సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ అనంత్ రెడ్డి

కడ్తాల్: ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు, అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ముంతాజ్ అన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ-2025లో భాగంగా మండల కేంద్రంలో శనివారం ప్రత్యేక ఓటరు నమోదును స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండే యువత కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. సవరణ, వెలువడిన ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే.. బూత్ లెవల్ సిబ్బందికి తెలపాలని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో..

నూతన ఓటరు నమోదుకు ఫామ్-6, అక్టోబర్ 29న విడుదల చేసిన ఓటరు ముసాయిదాలో అభ్యంతరాల కోసం ఫారం-7, సవరణల కోసం ఫారం-8లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. ఆన్‌లైన్‌లో ఎన్నికల సంఘం వెబ్‌సైట్, ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అనంతరం అన్మాస్‌పల్లి, గానుగుమార్లతండాలో ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం జంగయ్య, బూత్‌లెవల్ సిబ్బంది వనిత, జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు రాధాకృష్ణారెడ్డి, భీముడు ఉన్నారు.

అవగాహన కల్పించాలి..

ఆమనగల్లు: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని కల్వకుర్తి ఆర్డీఓ శ్రీనునాయక్ అన్నారు. పట్టణంలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ప్రజలకు ఓటు హక్కుపై బీఎల్‌ఓలు అవగాహన కల్పించాలని సూచించారు.

అర్హులందరూ..

తుర్కయంజాల్: అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి అన్నారు. పురపాలక సంఘం పరిధి ఉమర్‌ఖాన్ గూడ, రాగన్నగూడలో ఓటరు నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు పొందాలని సూచించారు. అందుకు బీఎల్‌ఓలను సంప్రదించి, ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. అనంతరం సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిజాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోపాష్టమి వేడుకలు


గోవుకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పహాడీషరీఫ్: గోపాష్టమి సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలోని హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోవును కృష్ణుడు పూజించిన రోజు కావడంతో గోవుతో పాటు లేగదూడను కూడా తీసుకొచ్చి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోవును రక్షించుకునే బాధ్యతను ప్రతి హిందువు కర్తవ్యంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాగార్జున, హరికృష్ణ, లాల్ శ్రీకాంత్ గౌడ్, మనోజ్, బబ్లూ, ప్రభాకర్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు విరాళం

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలోని గోశాలకు భక్తులు విరాళం అందజేశారు. పట్టణానికి చెందిన దుర్గాప్రసాద్, స్పందన దంపతులు రూ.11వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. గోవుల సంరక్షణకు విరాళం అందించినట్లు దాతలు తెలిపారు. కానుగు అంతయ్య, రఘుగౌడ్, రమేశ్, రఘునందన్‌రెడ్డి, క్యాసెట్ శ్రీనివాస్, లక్ష్మణ్, కిషన్‌నాయక్, రాఘవేందర్, నారాయణ, కృష్ణయ్య, లక్ష్మి కాంత్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

హమాలీల సంక్షేమానికి కృషి

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి


నూతన కమిటీని సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: హమాలీల సంక్షేమాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హమాలీ సంఘం మండల నూతన కమిటీని ఇటీవల ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో సంఘం అధ్యక్షుడు రమేశ్, కోశాధికారి వెంకటేశ్, సహాయ కార్యదర్శులు వెంకటేశ్, జంగయ్య, ఉపాధ్యక్షులు కృష్ణయ్య, జనార్దన్, కృష్ణయ్య, జంగయ్య, సలహాదారులు రమేశ్, మల్లేశ్, పెంటయ్య, లింగయ్య, శ్రీను, కృష్ణయ్యలను శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. యూనియన్ నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హమాలీలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు ముత్తికృష్ణ, భిక్షపతి, శ్రీను, రవి, శ్రీకాంత్, రాజేశ్, రమేశ్, మహేశ్, సత్యం, వెంకటేశ్, జంగయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.

సేవాభావంతో వైద్యసేవలు అందించాలి

ఓరియంటేషన్ డేలో వైద్యనిపుణులు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆశీష్ చౌహాన్

ఇబ్రహీంపట్నం: వైద్య విద్య మానవత్వ విలువలతో కూడినది. క్రమశిక్షణ, పట్టుదలతో అభ్యసించి, భవిష్యత్తులో వైద్యరంగంలో నిష్ణాతులు కావాలని హోమియోపతి ఎండీ, డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కళాశాల(హైదరాబాద్) ప్రిన్సిపాల్ ఆశిష్ చౌహాన్, షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ రాజేశ్‌రెడ్డి అన్నారు. శనివారం గురునానక్ యూనివర్సిటీలో హోమియోపతి మెడికల్ కళాశాల 2024-25 విద్యాసంవత్సం నూతన విద్యార్థులకు ఓరియెంటేషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేవాభావంతో వైద్యులుగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. డయాబెటిస్, బీపీ, కేన్సర్, గుండె సంబంధిత వ్యాధులు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని పేర్కొన్నారు. అల్లోపతి ఔషధాలు అధిక వ్యయం అవుతుండటంతో.. రోగులు వాటిని కొనలేకపోతున్నారని తెలిపారు. దానికి ప్రత్యామ్నాయంగా హోమియో మందులను వాడుతున్నట్లు వివరించారు. ఎలాంటి హాని చేయని హోమియోపతి వైద్యంపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ కోహ్లి, ఎండీ హెచ్‌ఎస్ సైని, యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ సంజీవ్ శ్రీవాస్తవ, పిన్సిపాల్ రేణుక, డాక్టర్ అపర్ణలు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధిపై అవగాహన

కొత్తూరు: ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవినంలో చాలామంది జంక్‌ఫుడ్‌ను తింటూ వారికి తెలియకుండానే మధుమేహం బారిన పడుతున్నట్లు జిమ్స్ ఆస్పత్రి హోమియోపతి వైద్యులు తెలిపారు. ఆస్పత్రి దత్తత తీసుకున్న మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు మధుమేహ వ్యాధి నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సిబ్బంది గ్రామంలోని పలువురికి ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. అంతేకాకుండా వ్యాధి బారినపడే అవకాశం ఉన్న వారితో పాటు మధుమేహంతో బాధపడే వారికి వ్యాధి నియంత్రణకు తీసుకోవాల్సిన ఆహార నియమాలను సూచించారు. కార్యక్రమంలో వైద్యులు పూనమ్‌సుతార్, విరాజిత, హన్మంతు, వైద్య విద్యార్థులు, పంచాయతీ కార్యదర్శి గౌస్ పాల్గొన్నారు.

ఇవేం నీళ్లు?

- కలుషిత నీరు సరఫరా
- పట్టించుకోని అధికారులు


ఎరుపురంగులో తాగునీరు

తుక్కుగూడ: మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా నీరు కలుషితం అవుతోంది. పుర పరధి ఔటర్ రింగు రోడ్డు లోపలి భాగంలో తుక్కుగూడ, రావిర్యాల, సర్దార్‌నగర్, దేవేందర్‌నగర్‌కాలనీ, బాసగూడతండా, ఆర్‌సీఐ గ్రామ ప్రజలకు హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో సుమారు 4900 తాగునీటి కనెక్షన్లు ఉన్నాయి. వీటి ద్వారా రోజు నీటిని సరఫరా అవుతోంది. ఇలా సరఫరా అవుతున్న నీరు అప్పుడప్పుడు రంగు మారుతూ గ్రామస్తులను కలవర పెడుతోంది. దుమ్ముధూళి కలిసి ఎరుపు రంగులో వస్తున్న నీటిని తాగడానికి భయపడుతున్నారు. నీరు కలుషితం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. ఇదే అంశంపై హెచ్‌ఎండబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. పరిస్థితిని సమీక్షించి, మున్సిపల్ శాఖ సహకారంతో నీరు కలుషితం కాకుండా చూస్తామని పేర్కొన్నారు.

పైపులైన్ ఏర్పాటయ్యేనా?

తుక్కుగూడ పట్టణ కేంద్రంలో లక్షల లీటర్ల నీరు నిల్వ చేసే ట్యాంక్‌ను హెచ్‌ఎండబ్ల్యూఎస్ నిర్మించింది. దీని ద్వారా పాతబస్తీకి నీరు సరఫరా చేసేందుకు పెద్ద పైపులైన్ వేయాల్సి ఉంది. శ్రీశైలం జాతీయ రహదారి క్రాసింగ్ చేయడానికి రోడ్డు తవ్వకాల కోసం ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో పైపులైన్ పనులు నిలిచిపోయాయి.